క్లుప్తంగా

రేపటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ బాలుర, బాలికల కళాశాలలో ఈనెల 26 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు ప్రారంభం అవుతాయని ప్రిన్సిపాల్ మమత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షలకు మొత్తం 232 మంది జనరల్ విద్యార్థులు, 162 మంది వృత్తి విద్యా కోర్సు విద్యార్థులు హాజరవుతారన్నారు. మొదటి సెషన్ ఉదయం 9 గంటలకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తామన్నారు. మార్చి 4 వరకూ ప్రాక్టికల్స్ జరుగుతాయన్నారు. ప్రతి ప్రయోగశాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే డీబార్ చేస్తామని ఆమె హెచ్చరించారు.

ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తు చేసుకోండి

కళ్యాణదుర్గం: ఇంటర్ చదువు మధ్యలో ఆపేసిన విద్యార్థులు ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జయలక్ష్మి సూచించారు. స్థానిక కళాశాలలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈనెల 27లోపు ఏపీ ఓపెన్ స్కూల్.ఏపీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత కాపీని కళాశాలలో అందించాలన్నారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

కుందుర్పి: పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఇంటర్ చేరని విద్యార్థులకు ఓపెన్ స్కూల్ ద్వారా చదువుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ఇంటర్‌లో చేరి మధ్యలో కళాశాల మానేసిన విద్యార్థులకు సైతం అవకాశం కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులు రూ.2,300 ఫీజు చెల్లించి, ఈ నెల 27 లోపు అడ్మిషన్లు పొందాలని ఆయన సూచించారు.

తక్షణసాయం అందజేత



మృతుని కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న దృశ్యం

కంబదూరు: మండలంలోని కదిరిదేవరపల్లికి చెందిన గొల్ల వీరేష్(33) అనే వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. శుక్రవారం వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద మృతుని తండ్రి గొల్ల పాతన్నకు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ అనురాధ అందజేశారు. మిగిలిన సొమ్ము వ్యక్తిగత ఖాతాలోకి జమవుతుందని వారు తెలిపారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

గుమ్మఘట్ట: పంట నమోదు పూర్తయిన రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏఓ నిర్మల్‌కుమార్ సూచించారు. మండలంలోని కలుగోడులో రైతు భరోసాకేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ నెలాఖరులోగా ఆర్బీకేల్లో సిబ్బందిని సంప్రదించి రైతులు ఈ-కేవైసీ చేయించుకుంటే ప్రభుత్వం నుంచి లభించే ఆర్థిక సాయం అందుతుందన్నారు. లేకుంటే పరిహారం అందదన్నారు.

గజలక్ష్మి ఆలయంలో పూజలు

రాయదుర్గంటౌన్: మల్లాపురం ఇందిరమ్మ కాలనీలో గజలక్ష్మి దేవి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకాలు చేసి హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు గావించారు. ప్రతి శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. భక్తులు పాల్గొని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే పట్టణంలోని దుగ్గిలమ్మ ఆలయం, దండుమారెమ్మ ఆలయాల్లో పూజలు చేశారు.

'నిధుల కోత దారుణం'

కళ్యాణదుర్గం: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి చెందిన నిధుల్లో కోత విధించడం దారుణమని సీపీఎం నాయకులు మండిపడ్డారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు శుక్రవారం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్ ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి, ఆరోగ్య పథకాలకు మొండిచేయి చూపడం సరైంది కాదన్నారు. సీపీఎం నాయకులు రంగనాథ్, రఘు, విక్రమ్, తిప్పేస్వామి, నాగరాజు, మనోజ్, ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీ, ఉదయ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లలో పురోగతి

- జిల్లాస్థాయిలో 'దుర్గం' మున్సిపాలిటీ రెండోస్థానం
- వార్డుల్లో ప్రత్యేక కౌంటర్లతో సత్ఫలితాలు



వార్డుల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వసూలు కేంద్రంలో పన్నులు స్వీకరిస్తున్న ఆర్ఐ, బిల్ కలెక్టర్లు

రాయదుర్గంటౌన్: ఆస్తి, నీటి పన్నుల వసూళ్లలో మంచి పురోగతితో రాయదుర్గం మున్సిపాలిటీ ముందుకు సాగుతోంది. పన్నుల వసూళ్లకు వార్డుల్లోనే ప్రత్యేక వసూలు కౌంటర్లు ఏర్పాటు చేయడంతో లక్ష్యానికి చేరువయ్యారు. ఏటా జనవరి లేదా ఫిబ్రవరిలో వార్డుల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి వసూళ్లపై దృష్టి సారించేవారు. కానీ ఈ ఏడాది డిసెంబర్ నుంచే వార్డుల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేసి వంద శాతం వసూలుకు అధికారులు చర్యలు చేపట్టారు. అంతేకాక మున్సిపల్ కార్యాలయంలో కూడా ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. వార్డులు, ఇంటింటి పన్నుల వసూలు, కార్యాలయంలోనూ ప్రత్యేక కౌంటర్ ద్వారా వందశాతం పన్నులు రాబట్టేందుకు అన్ని చర్యలు చేపట్టారు.

పన్ను వసూళ్లలో రెండో స్థానం..

శుక్రవారం నాటికి రాయదుర్గం మున్సిపాలిటీలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు సంబంధించి రూ.3.22 కోట్లు బకాయి ఉండగా రూ.2.16 కోట్లు వసూలు చేశారు. అలాగే నీటి కొళాయి పన్ను డిమాండ్ రూ.3.02 కోట్లకు గాను ఇప్పటి దాకా రూ.1.12 కోట్ల వసూలు చేశారు. ఆస్తి పన్ను వసూళ్లలో తాడిపత్రి మొదటిస్థానంలో ఉండగా రాయదుర్గం మున్సిపాలిటీ జిల్లాస్థాయిలో రెండోస్థానంలో కొనసాగుతోంది. రోజూ ఒక వార్డులో ప్రత్యేకవసూలు కేంద్రాన్ని ఏర్పాటు చేయించి పన్ను వసూలుకు కమిషనర్ దివాకర్‌రెడ్డితోపాటు ఆర్ఐ మహబూబ్‌బాషా, బిల్ కలెక్టర్ల ఆధ్వర్యంలో దృష్టి సారించారు.

వంద శాతం వసూళ్లే లక్ష్యం



వంద శాతం పన్నులు వసూలు లక్ష్యంగా ప్రత్యేక టీంల ద్వారా కృషి చేస్తున్నాం. కార్యాలయంలో కౌంటర్లతోపాటు వార్డుల్లోనే పన్ను యజమానులకు సౌకర్యంగా కౌంటర్లు ఏర్పాటు చేసి వసూలు చేస్తున్నారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించేలా అవగాహన కల్పిస్తున్నాం.

– దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

రవీంద్రారెడ్డిని గెలిపించుకుందాం

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో విప్ కాపు రామచంద్రారెడ్డి



రాయదుర్గం: డి హీరేహాళ్ లో మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం/బొమ్మనహాళ్/కణేకల్లు: రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ లో నిలిచిన వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డి విజయానికి పార్టీ శ్రేణులంతా శక్తి వంచన లేకుండా కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, పట్టభద్రుల అభ్యర్థి సోదరుడు వెన్నపూస సంజీవరెడ్డితో కలసి రాయదుర్గం నియోజకవర్గంలోని డి హీరేహాళ్, బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లో విస్తృత ప్రచారం చేపట్టారు. ఆయా మండలాల్లోని ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులు, పార్టీ కన్వీనర్లు, ముఖ్య నాయకులతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ మార్చి 13న జరిగే పట్టభద్రుల ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి వెన్నంటి నిలిచిన వారంతా ఎమ్మెల్సీ ఎన్నికలను కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు తీసుకెళుతున్న సీఎం జగన్ వెంటే మేధావులైన పట్టభద్రులు నిలిచేలా విజ్ఞప్తి చేయాలన్నారు. మరి కొన్ని నెలల్లోనే టీడీపీ అడ్రస్ గల్లంతు కావడం ఖాయమన్నారు. మోసకారి చంద్రబాబును నమ్మేస్థితిలో జనం లేరన్నారు. ఈ జిత్తుల మారిని మేధావులే నమ్ముతారన్నారు. సమస్యను సామరస్యంగా వివరిస్తే పరిష్కరించే గుణం జగన్‌కు మాత్రమే ఉందన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలకు పరిష్కారం చూపేది జగన్‌కే సాధ్యమవుతుందన్నారు. ఆయా మండలాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల, సచివాలయ కన్వీనర్లు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

నాణ్యతలో మేటి భారతి సిమెంట్



మేస్త్రీలకు బీమా పత్రాలను అందజేస్తున్న భారతి సిమెంట్ కంపెనీ సేల్స్ మేనేజర్ ఎం.లాల్‌నాయక్

కణేకల్లు: అన్నింటి కంటే నాణ్యమైన సిమెంట్ భారతి సిమెంటని.. ఆ కంపెనీ సేల్స్ మేనేజర్ మోతీలాల్‌నాయక్ అన్నారు. కణేకల్లులో శుక్రవారం తాపీ మేస్త్రీలు, వినియోగదారులకు నిర్వహించిన సమావేశంలో సేల్స్ మేనేజర్ మాట్లాడారు. అత్యుత్తమ కట్టడాలకు మన్నికైన నంది భారతి సిమెంట్ మాత్రమేనన్నారు. సామాన్య ప్రజలకు సైతం అందుబాటు ధరలో సిమెంటు లభిస్తోందన్నారు. ప్రతి ఒక్కరికీ సొంతిళ్లు నిర్మించుకోవాలనే కల ఉంటుందని ఆ ఇళ్లు పది కాలాల పాటు పదిలంగా ఉండాలంటే తమ కంపెనీ సిమెంటు వాడాలన్నారు. నిర్మాణ సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే అండగా ఉండాలనే ఉద్దేశ్యంతో తమ కంపెనీ ప్రమాద బీమా కల్పిస్తోందన్నారు. అనంతరం తాపీ మేస్త్రీలకు బీమా పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భారతి సిమెంటు కంపెనీ ప్రతినిధులు, డీలర్లు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో భాగస్వాములు కండి



వలంటీర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజేష్

కంబదూరు: నేరాల నియంత్రణలో పోలీసులతో వలంటీర్లు కూడా భాగస్వాములు కావాలని ఎస్ఐ రాజేష్ సూచించారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో మండలంలోని గ్రామ వలంటీర్లతో ఎస్ఐ సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల గ్రామీణ ప్రాంతాల్లో తాళాలు వేసి ఇళ్లను టార్గెట్ చేసుకుని దొండలు చోరీలకు పాల్పడుతున్నారని, ఈ క్రమంలో లాకర్ హౌస్ గురించి వలంటీర్లు అవగాహన పెంచుకుని దొంగతనాల నియంత్రణకు పోలీసులకు సహకరించాలన్నారు. మీ పరిధిలో ఎవరైనా ఇళ్లకు తాళాలు వేసి వేరేఊరికి వెళ్లి ఉంటే వెంటనే వివరాలను అందుబాటులో ఉన్న జీఎంఎస్‌కేలకు తెలియజేయాలన్నారు. అలాగే దొంగతనాలు జరగకుండా ముందు జాగ్రత్తగా తీసుకోవాల్సిన చర్యల గురించి మీ పరిధిలోని వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జీఎంఎస్‌కే నాగమణి, కానిస్టేబుల్ లోకేష్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు క్రీడలు ఎంతో అవసరం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దృశ్యం

కళ్యాణదుర్గం: విద్యార్థినులకు క్రీడలు ఎంతో అవసరమని ఆర్డీటీ ఏటీఎల్ మీనాక్షి, కేసీజీహెచ్ హెచ్ఎం గంధం శ్రీనివాసులు అన్నారు. స్థానిక కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ బాలికల క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఇందులో కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలోని 8 బాలికల జట్లు పాల్గొనగా లీగ్, సెమీ ఫైనల్ పోటీలను నిర్వహించారు. ఆయా మ్యాచ్‌లలో కళ్యాణదుర్గం కేసీజీహెచ్, ఏపీ మోడల్ పాఠశాల జట్లు తలపడ్డాయి. ఇందులో ఏపీ మోడల్ పాఠశాల విన్నర్‌గా గెలిచింది. శనివారం ఇరు జట్లకు ఫైనల్ మ్యాచ్ నిర్వహించనున్నట్లు కోచ్ హరినాథ్‌రెడ్డి తెలిపారు.

సర్వ సభ్య సమావేశం వాయిదా

కంబదూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. సమావేశానికి సభ్యులు తక్కువ మంది రావడంతో కోరం లేక వాయిదా పడినట్లు ఎంపీపీ తిమ్మరాజమ్మ తెలిపారు.

మత్తు పదార్థాలతో అనర్థాలు



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

కళ్యాణదుర్గం: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సెబ్ సీఐ లక్ష్మణ్‌దాస్ అన్నారు. స్థానిక ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం డ్రగ్స్ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కాలేజీ విద్యార్థులు చదువుపై ఏకాగ్రతతో ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్ వాడకం తగ్గించాలన్నారు. డ్రగ్స్ వంటి వాటికి బానిసలైతే జీవితం నాశనమవుతుందన్నారు ప్రతి ఒక్కరూ ఉన్నత ఆశయంతో చదువులో రాణించి తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలన్నారు. అనంతరం విద్యార్థులచే డ్రగ్స్ అవేర్‌నెస్‌పై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ శేషయ్య, అధ్యాపకులు సుధాకర్, లక్ష్మీనారాయణ, ఈశ్వర్‌రెడ్డి, ఎక్సైజ్ ఎస్ఐ కృష్ణానాయక్, విజయభాస్కర్, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

శెట్టూరు: పొగాకు నమలడం, సిగరెట్లు, బీడీలు తాగడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని డాక్టర్ వేణుకార్తీకేయ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని అనుంపల్లి గ్రామంలో పొగాకు, ధూమపానం కట్టడిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సర్వేయర్ల సమస్యల పరిష్కారానికి కృషి

బెళుగుప్ప: ఏపీ సర్వే ఎంప్లాయిస్ అసోసియేషన్(ఏపీఎస్ఈఏ)తో సర్వేయర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మండల సర్వేయర్ యమున, అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వినోద్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి అసోసియేషన్ 2023 క్యాలెండర్లు, డైరీలను మండల సర్వేయర్లతో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ సురేఖ, అసోషియేషన్ సభ్యులు ఇర్షద్ బాషా, సచివాలయాల సర్వేయర్లు పాల్గొన్నారు.

అభివృద్ధిపై ప్రజాక్షేత్రంలో తేల్చుకుందాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు

గుమ్మఘట్ట: ఎవరి ప్రభుత్వ హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందో ప్రజాక్షేత్రంలో తేల్చుకుందామని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు అన్నారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ భోజరాజ్‌నాయక్‌పై టీడీపీ నాయకులు చేసిన ఆరోపణలను మండలకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డిని విమర్శించే స్థాయి మీకు లేదన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై లెక్కలతో వస్తాం.. మీరు రెడీనా అని ప్రశ్నించారు. నిరుపేదల కోసం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి మానవతాదృక్పథంతో గతంలో కంటి ఆపరేషన్లు చేయిస్తుంటే అధికారులను అడ్డం పెట్టుకుని నిలుపుదల చేయించిన నీచ సంస్కృతి మీ నాయకుడు కాలువ శ్రీనివాసులు కాదా అని మండిపడ్డారు. కాపు చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాల గురించి మాట్లాడే అర్హత మీకు లేదన్నారు. ఏనాడైనా మీ నాయకుడు సామాజిక సేవా కార్యక్రమాలు చేశాడా అని దుయ్యబట్టారు. మీ నాయకుడికి రాయదుర్గంలో ఓటు హక్కులేదు. అది తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పూలకుంట రామన్న, గుమ్మఘట్ట రాజు, బీటీపీ హనుమంతు, వన్నూరుస్వామి, మల్లేశ్, రంగచేడు శివ, తాళ్లకెర మహేష్, తాళ్లకెర రాజు తదితరులు పాల్గొన్నారు.

శివాలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్

రాయదుర్గం: మండలంలోని ఆవులదట్ల తండాకు చెందిన రైల్వే ఉద్యోగి హోబ్యానాయక్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సొంత నిధులతో గ్రామంలో శివాలయం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. శుక్రవారం మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్, గ్రామపెద్దలతో కలసి హోబ్యానాయక్ దంపతులు ప్రతిష్ట హోమాలు, వేదమంత్రోచ్చారణల మధ్య భూమిపూజ చేపట్టారు. మార్కెట్‌యార్డ్ చైర్మన్ మాట్లాడుతూ ఎంత ఎత్తుకు ఎదిగినా స్వగ్రానికి మేలు చేయాలన్న ఆలోచన కలగడం గర్వించదగ్గ విషయమన్నారు. స్థలంతో పాటు శివాలయ నిర్మాణానికి సుమారు రూ.50 లక్షలకు పైగా ఖర్చుపెట్టేందుకు ముందుకురావడం సంతోషదాయకమన్నారు ఆలయ నిర్మాణం పూర్తయ్యే వరకు విప్ కాపు రామచంద్రారెడ్డితో పాటు తాను అండగా ఉంటామన్నారు.

వైద్యులు నిత్యం అందుబాటులో ఉండాలి



పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ అనుపమ

వజ్రకరూరు: 24 గంటలూ వైద్యులు ఆస్పత్రిలో ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సర్పంచు కె.సురేంద్ర, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా కార్యదర్శి పార్వతి, గ్రామస్తులు కోరారు. వైద్యుల తీరుపై గ్రామస్తుల ఆగ్రహం అన్న శీర్షిక గురువారం 'సాక్షి'లో ప్రచురితం కావడంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. శుక్రవారం అడిషినల్ డీఎంహెచ్‌ఓ అనుపమ మండలంలోని గడేహోతూరు ప్రభుత్వాస్పత్రిని ఆకస్మి కంగా తనిఖీ నిర్వహించారు. రెండు రోజుల క్రితం చిన్నహోతూరు గ్రామానికి చెందిన గర్భిణి వెన్నెల అనారోగ్యంతో ప్రభుత్వాస్పత్రికి రావడం, ఆ సమయంలో వైద్యులు లేకపోవడం తదితర వాటిపై ఆమె విచారణ చేపట్టారు. అనంతరం ఆస్పత్రిలో పలు రికార్డులను పరిశీలించి, వైద్యు లు, సిబ్బంది పనితీరుపై వివరాలు ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమెను సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా కార్యదర్శి, గ్రామస్తులు కలిశారు. ఇటీవల ప్రభుత్వం గడేహోతూరు పీహెచ్‌సీని 24 గంటల ఆస్పత్రిగా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఆ ఉత్తర్వుల మేరకు 24 గంటలూ వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి మారుతీప్రసాద్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడి కల్యాణోత్సవం



నృసింహుడికి కల్యాణోత్సవ దృశ్యం

కూడేరు: మండలంలోని కలగళ్ల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం నృసింహుడి కల్యాణ మహోత్సవం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కనుల పండువగా సాగింది. వేడుకల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా నృసింహుడు నామస్మరణ మార్మోగింది. సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఉమ్రా యాత్రికులకు ఆత్మీయ సన్మానం



యాత్రకు వెళ్తున్న వారిని సన్మానిస్తున్న దృశ్యం

ఉరవకొండ: పట్టణానికి చెందిన పీఏసీఎస్ చైర్మన్ వడ్ల షేక్షావలి, వైఎస్సార్‌సీపీ యువ నాయకులు వడ్ల షామీర్, అనీస్ పవిత్ర ఉమ్రా యాత్రకు శుక్రవారం బయలుదేరారు. వారిని వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మీరంబాషా, పీఏసీఎస్ డైరెక్టర్ బ్యాళ్ల ప్రసాద్, జైనబీ దర్గా అధ్యక్షుడు హోతురు బాషా, సచివాలయ కన్వీనర్ బళ్లారి ఆసీఫ్, అయ్యర్‌దాదా, కోఆప్షన్ సభ్యులు పామిడి సలీం, అన్వర్, పీఏసీఎస్ సీఈఓ గౌస్ తదితరులు సత్కరించి వీడ్కోలు పలికారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చేలా పవిత్ర మక్కా సన్నిధిలో దువా చేయాలని వారు కోరారు.

ఘనంగా భాగవత సప్తాహ యజ్ఞం



కమలపాడులో అష్టోత్తర శతనామావళి చదువుతున్న దృశ్యం

వజ్రకరూరు: మండలంలోని కమలపాడులో ఉన్న శాంతానంద ఆశ్రమంలో శుక్రవారం ద్వితీయ భాగవతసప్తాహ యజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో జగజ్జనని ఈశ్వరీదేవి, సద్గురు శాంతానంద స్వామికి పూజలు చేపట్టారు. అనంతరం పలు హోమాలు, మహా మంగళహారతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పీఠాధిపతి గురుసేవానందస్వామి మాట్లాడుతూ లోక శాంతి కోసం బృహత్తర భాగవత సప్తాహ యజ్ఞం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం మార్చి 2 వరకూ చేపడతామన్నారు.

వైభవంగా సుంకలా పార్వతీదేవి రథోత్సవం



పాల్తూరులో సుంకలా పార్వతీ దేవి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



హాజరైన భక్తులు

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు గ్రామంలో శుక్రవారం సుంకలా పార్వతీ దేవి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. అందంగా పూలతో అలంకరించి రథంలో సుంకలా పార్వతీ దేవి ప్రతిమను ఉం బసవన్న గుడి వరకూ భక్తులు లాగారు. మండలంలోని కరకముక్కల, గాజుల మల్లాపురం, ఉండబండ,చీకల గురికి,విడపనకల్లు ఉరవకొండ, ముస్టూరు, బూదగవి గ్రామాలతో పాటు కర్ణాటక రాష్ట్రం లోని రూపనగుడి, శంకరబండ, బళ్లారి, తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి సుంకలా పార్వతీ దేవికి పూజలు నిర్వ హించారు. అంతకుముందు ఉదయం సుంలకా పార్వతీదేవి ఉచ్చాయం లాగారు. ఉరవకొండ సీఐ శేఖర్, పాల్తూరు, విడపనకల్లు ఎస్ఐ రామచంద్రయ్య ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు: ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి వేడుకలకు హాజరై సుంకులా పార్వతీ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వై.మధుసుదన్‌రెడ్డి, విడపనకల్లు ఎంపీపీ కరణం పుష్పావతి, భీంరెడ్డి వేడుకల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

భక్త కనకదాస విగ్రహ ప్రతిష్ట

బెళుగుప్ప: మండలంలోని కాలువపల్లిలో కురుబల ఆరాధ్య దైవం భక్త కనకదాస విగ్రహ ప్రతిష్ట శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గంగపూజ, గణపతి, నవగ్రహ పూజలు హోమాలు, మృత్యుంజయ హోమం, లక్ష్మీనారాయణ హోమం, మహాపూర్ణాహుతి హోమాలను నిర్వహించారు. అనంతరం కనకదాస చిత్రపటంతో గ్రామోత్సవం నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పెనుగొండ మాజీ ఎమ్మెల్యే పార్థసారధి, కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజహంస శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి శివబాల, సహకార సంఘ మండల అధ్యక్షుడు శివలింగప్ప, కురుబ సంఘం మండల అధ్యక్షుడు కరుణాకర్, అగ్రి బోర్డు మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచ్ పెద్దన్న, మాజీ ఎంపీటీసీ వెంకటేశులు, కురుబలు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు నేటికి వాయిదా

కూడేరు: స్థానిక శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం జరగాల్సిన హుండీ కానుకల లెక్కింపు కొన్ని అనివార్య కారణాలతో శనివారానికి వాయిదా వేసినట్లు ఆలయ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ బి.బాబు శుక్రవారం తెలిపారు. ఆలయ సేవ, జీర్ణోద్ధారణ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు హాజరు కావాలని ఈఓ కోరారు.